సాక్షి
హనుమకొండ

బుధవారం । 8 । అక్టోబర్ । 2025



తెగులు.. దిగులు

రైతులకు సిరులు కురిపించే పసుపు పంటకు అధిక వర్షాల కారణంగా తాటాకు తెగులు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. - 8లో▸



పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32⁰ /23⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

'కలెక్టరేట్‌లో కామాంధుడు'పై వేటు

- సస్పెండ్ చేసిన హనుమకొండ కలెక్టర్
- తదుపరి చర్యలకు సిఫారసు



సస్పెన్షన్‌కు గురైన ఇర్ఫాన్

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్ తన వద్ద పనిచేసే మహిళా ఉద్యోగిపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ కామాంధుడిపై కలెక్టర్ స్నేహ శబరీష్ కొరఢా ఝుళిపించారు. సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ ఏ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్ సోహెల్ కార్యాలయంలోని మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అతని తీరుపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం వెలువడింది. దీంతోపాటు ఓ మహిళా ఉద్యోగి ఫిర్యాదు మేరకు ప్రాథమిక చర్యల్లో భాగంగా కలెక్టర్ స్నేహ శబరీష్.. అతనిని గత నెల 19న కలెక్టరేట్‌నుంచి ఎస్సారెస్పీకి బదిలీ చేశారు. ఆ వెంటనే సమగ్ర విచారణకు ఐసీసీ కమిటీని ఏర్పాటుచేశారు. తొమ్మిది మందితో ఏర్పాటైన ఐసీసీ కమిటీ.. బాధితురాలు, నిందితుడు, సాక్షులను విచారించింది. సాంకేతిక ఆధారాలు పరిశీలించింది. ఈ క్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్ సోహెల్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని కమిటీ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వీటన్నింటిని పరిశీలించిన కలెక్టర్ న్యాయ సలహా కూడా తీసుకుని ఆ కామాంధుడిపై మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. కాగా, ఇప్పటికే సదరు సీనియర్ అసిస్టెంట్ ఏర్పాటు చేసుకున్న చాంబర్‌ను అధికారులు తొలగించిన విషయం తెలిసిందే.

తదుపరి చర్యలకు సిఫారసు..

కలెక్టర్.. సదరు సీనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్‌ను సస్పెండ్ చేయడంతోపాటు తదుపరి కఠిన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు తెలిసింది. తన కార్యాలయంలో ఇలాంటి ఘటన జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు అనుగుణంగానే విచారణ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటూ వచ్చారు. భవిష్యత్‌లో మహిళా ఉద్యోగుల పట్ల అలాంటి ఆలోచన వస్తే ప్రస్తుత చర్యలు గుర్తుకు రావాలన్నట్లు కలెక్టర్ స్పందించి చర్యలకు ఉపక్రమించారు.

కుల సంఘాల ఫిర్యాదు..

బాధితురాలి పక్షాన ఎస్సీ సంఘాలు, ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ని కలిసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఇప్పటికే విన్నవించారు. ఈ ఫిర్యాదుపై కాకుండా నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని, అంతవరకు వేచిఉండాలని కలెక్టర్ వారికి సూచించారు. పలువురు మహిళా సిబ్బందిని వేధించిన సదరు ఉద్యోగి విషయంలో కలెక్టర్ తీసుకున్న చర్యలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

'సాక్షి'కి అభినందనలు..

ఈ ఘటన విషయంలో మొదటి నుంచి వాస్తవాలు వెలికి తెస్తూ, కథనాలు రాసిన 'సాక్షి'కి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాయి.









'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు..



కొత్తకొండకు 'త్రిశూల' శోభ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి కొత్త ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సొంత నిధులతో ఆలయ కమాన్ ఎదురుగా రూ.25లక్షల వ్యయంతో త్రిశూల చౌరస్తా నిర్మాణానికి గత నెల భూమి పూజ నిర్వహించారు. 22అడుగుల ఎత్తులో నిర్మించనున్న త్రిశూలం, ఢమరుకం, నంది విగ్రహాలు, ఓంకారంతో కూడిన అందమైన ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం నమూనాను విడుదల చేశారు.




త్రిశూల చౌరస్తా నమూనా

ఏమవుతుందో ఏమో..!

అందరి దృష్టి హైకోర్టు తీర్పు పైనే..

- 'స్థానిక' ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై నేడే జడ్జిమెంట్
- వేచి చూసే ధోరణిలో ప్రధాన పార్టీల నేతలు, ఆశావహులు
- అనుకూలమా? ప్రతి కూలమా? తేలాకే ఎన్నికల బరిలోకి..
- రేపటి నుంచే మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు



సాక్షిప్రతినిధి, వరంగల్:

షెడ్యూల్ వచ్చే దాకా ఒక టెన్షన్.. తేదీలు ప్రకటించాక రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌పై మరో టెన్షన్. ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై తేలే సమయం రానే వచ్చింది. బుధవారం వెలువడే హైకోర్టు తీర్పుపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతం కాగా.. అన్ని వర్గాల్లోనూ అనుకూలమా? ప్రతికూలమా? అనే ఉత్కంఠ కూడా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఆ వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ కూడా ప్రకటించింది. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల జీఓను సవాల్ చేస్తూ రెడ్డి జాగృతి సంఘం ప్రతినిధి వంగా గోపాల్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయడంతో మళ్లీ గందరగోళం నెలకొంది.

తీర్పు వెలువడిన తర్వాతే ముందుకు..

2024 ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాలు, జూలైలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఈ ఏడాది జనవరిలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. వీటన్నింటితోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీపీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తెరమీదకు తెచ్చింది. ఈ మేరకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో కుల గణన చేపట్టింది. అలాగే, బీసీ డెడికేషన్ కమిటీ వేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లులు రూపొందించి సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. ఆ ప్రక్రియలు పూర్తయ్యాక సెప్టెంబర్ నెలాఖరులో జీఓ 9 తీసుకొచ్చి వెంటనే రిజర్వేషన్లు ఖరారు చేసి, ఏకకాలంలో రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. దీంతో అభ్యర్థుల ఎంపికపై ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్న సమయంలో బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. దీంతో వేచిచూసే ధోరణికి వచ్చిన ప్రధాన పార్టీల నేతలు.. నేడు వెలువడే తీర్పు తర్వాత పరిస్థితులను బట్టి మరింత ముందుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

తీర్పుకు ముందే ఊహాగానాలు..

బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌పై నేడు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ఊహాగానాలు జోరందుకున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జెడ్పీలు, 75 జెడ్పీటీసీలు, 75 ఎంపీపీలకు రిజర్వేషన్ల గెజిట్ ఇప్పటికే విడుదలైంది. 778 ఎంపీటీసీ, 1,708 సర్పంచ్ స్థానాలు, 15 వేల పైచిలుకు వార్డులకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గురువారం నుంచి మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ఈ సమయంలో హైకోర్టు తీర్పు నేపథ్యంలో జోరందుకుంటున్న ఊహాగానాలు పల్లెల్లో గందరగోళ పరిస్థితులకు అవకాశం ఇస్తున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం హైకోర్టు బీసీల రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పునిస్తే ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగనున్నాయని, ఒకవేళ ప్రతికూలంగా తీర్పు వెలువరిస్తే మాత్రం రిజర్వేషన్లలో మార్పులు చేయనున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు కల్పించాల్సి రావడంతో ఇప్పుడు చేసిన రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు స్థానాలు తగ్గి జనరల్‌కు పెరుగనున్నాయని.. ఇలా రకరకాలు జరుగుతున్న ప్రచారానికి తోడు రోజు రోజుకు మారుతున్న రాజకీయ సమీకరణలతో పరిస్థితులు హాట్‌హాట్‌గా కనిపిస్తున్నాయి.

ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఐనవోలు

ఐనవోలు: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 70 ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఇటీవల ఎంపిక చేశారు. అందులో ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఒకటి. 21 అంశాలను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు ర్యాంకింగ్ ఇవ్వాల్సి ఉంది. కాగా, కేంద్ర బృందం ఈ వారంలో ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పర్వతగిరి ఇన్‌స్పెక్టర్, ఎస్సై వస్తం శ్రీనివాస్‌కు వారు పలు సలహాలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. మరో రెండు రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కూడా ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను సదర్శించనున్నట్లు సమాచారం.



సీఐ, ఎస్సైతో మాట్లాడుతున్న డీసీపీ అంకిత్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లలో దళారులపై ఆరా

శాయంపేట: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో రెండో రోజూ మంగళవారం సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. టోకెన్ల జారీ, కొనుగోలు కేంద్రాల రికార్డులను ఇప్పటికే సీజ్ చేసిన అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గత యాసంగి సీజన్‌లో ఎన్ని టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు, ఈ సీజన్‌లో ధాన్యం ఎక్కడి నుంచి వచ్చిందని నిర్వాహకులను ప్రశ్నించారు. దళారుల ప్రమేయం ఉందన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. లావాదేవీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలను కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మిల్లర్లు కుమ్మక్కై అక్రమాలకు తెరలేపినట్లు మండలంలో చర్చ జరుగుతోంది. మిల్లర్ల అక్రమాలపై కూడా అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. బుధవారం కూడా అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై అధికారులను ఫోన్‌లో సంప్రదించగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ఇసుక, మొరం రవాణాపై విచారణ

కమలాపూర్: మొరం, మట్టి, ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీస్ శాఖతో కలిసి మైనింగ్ శాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. కమలాపూర్‌లోని సమ్మక్క గుట్ట నుంచి కొందరు వ్యాపారులు అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారని, నేరెళ్ల వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని ప్రజావాణిలో ఇటీవల కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం మైనింగ్ శాఖ ఏడీ రవిశంకర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, స్థానిక తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్సై మధు, రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బందితో కలిసి సమ్మక్క గుట్ట ప్రాంతం, నేరెళ్ల వాగును పరిశీలించి పంచనామా రికార్డు చేశారు. వ్యాపారులకు నోటీసులు జారీ చేసి విచారిస్తామని, విచారణ పూర్తయ్యాక నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.



నేరెళ్ల వాగును పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌రీల్

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ షురూ



రామన్నపేట: బీఫార్మసీ, ఫార్మ్‌డీ, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ (బైపీసీ) కౌన్సెలింగ్ మంగళవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైనట్లు టీజీ ఎప్‌సెట్ అడ్మిషన్స్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, నిర్దిష్ట సమయానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. తొలిరోజు (మంగళవారం) 313 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం నమోదు చేసుకున్నారని, ఈనెల 9వ తేదీ వరకు సర్టిఫికెట్లషన్ ఉంటుందని వివరించారు. అనంతరం ఆప్షన్ ఫ్రీజింగ్, సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు http://tgeapcetb.nic.in వెబ్‌సైట్ సందర్శించాలని ఆయన కోరారు.

కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమించాలి



న్యూశాయంపేట: కార్మిక చట్టాల రక్షణ కోసం నిరంతరం ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. హనుమకొండలో మంగళవారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం రెండో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.సారంగపాణి, ప్రధాన కార్యదర్శిగా టి.ఉప్పలయ్య, కోశాధికారిగా ఎ.యాకయ్యతోపాటు పి.రవి, పి.అశోక్, సాంబయ్య, వెంకటస్వామి, భిక్షపతి, రవీంద్రాచారి, సుదర్శన్, రవీందర్, రాజు, స్వప్నను ఎన్నుకున్నారు.

సీజేఐపై దాడికి యత్నం.. న్యాయ దేవతపై దాడే



వరంగల్ లీగల్: దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం.. న్యాయ దేవతపై జరిగిన దాడిగానే పరిగణించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ అన్నారు. సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ రెండు బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట భారీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవ్యవస్థ గౌరవమే ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని పేర్కొన్నారు. ప్రస్తుతం న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని, అదేపరిధిలో న్యాయమూర్తుల రక్షణను కూడా చేర్చడం అత్యవసరమని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే దాడికి పాల్పడిన సదరు న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు జయపాల్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, కోశాధికారి అరుణ, ఈసీ సభ్యులు సురేశ్, మేఘనాథ్, మహేందర్, బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బలమున్న చోట బరి గీసి..!

- 'స్థానిక' ఎన్నికల్లో పొత్తులు.. కాంగ్రెస్‌తో 'కామ్రేడ్'లు ముందుకు
- నాలుగు జెడ్పీటీసీ స్థానాలపై గురి... ఎంపీటీసీ, సర్పంచ్‌లకూ పోటీ

సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిచేందుకు కామ్రేడ్‌లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బలమున్న చోట పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనలు చేశారు. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జెడ్పీటీసీ స్థానాల పేర్లను సూచించిన సీపీఐ నేతలు అందులో నాలుగు తప్పకుండా ఇవ్వాలన్న డిమాండ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముందుపెట్టారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డితో మంగళవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ ఎన్నికల్లోనూ పొత్తుతో ముందుకు సాగాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో రాష్ట్ర వ్యాప్తంగా తమకు బలమున్న చోట పోటీ చేస్తామని సీపీఐ నేతలు చెప్పినప్పటికీ.. ప్రత్యేకంగా ఉమ్మడి వరంగల్‌లో జెడ్పీటీసీ సీట్ల కేటాయింపుపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి (ఎస్సీ-జనరల్), వరంగల్‌లో నల్లబెల్లి (బీసీ-జనరల్)ను ఇవ్వాలని సీపీఐ ప్రతినిధుల బృందం కాంగ్రెస్ నేతలకు ప్రతిపాదించింది. మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ (బీసీ-జనరల్), నెల్లికుదురు (బీసీ-జనరల్)లో ఏదే ఒకటి, జనగామ జిల్లాలో రఘునాథపల్లి (బీసీ-మహిళ), జఫర్‌గఢ్ (బీసీ-జనరల్)లో ఒకచోట జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు చాన్స్ ఇవ్వాలని కోరారు. ఇక ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల విషయంలో సీపీఐకి బలమున్న చోట స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుని అభ్యర్థులను సూచిస్తామని కాంగ్రెస్ నేతలతో స్పష్టం చేసినట్లు తెలిసింది. కాగా, బుధవారం ఉమ్మడి వరంగల్‌కు చెందిన సీపీఎం నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డిని పొత్తుల విషయంలో కలువనున్నారన్న చర్చ కూడా జరుగుతోంది.

'స్మార్ట్‌సిటీ'కి డిసెంబర్ డెడ్‌లైన్

వరంగల్ అర్బన్: నగరంలో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి వంద శాతం పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్(జీడబ్ల్యూఎస్‌సీసీఎల్) చైర్‌పర్సన్, రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ స్మార్ట్‌సిటీ 29వ బోర్డు సమావేశం మంగళవారం నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులు పాల్గొన్నారు. స్మార్ట్‌సిటీలో పూర్తయి బిల్లులు రాని పనులు, పురోగతిలో ఉన్న వాటి వివరాలను చైర్‌పర్సన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులకు సంబంధించి బోర్డులో అప్రూవల్ తీసుకున్న ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు అనుమతి పొందినట్లు వెల్లడించారు. ఇంకా పూర్తికాని ప్రాజెక్టుల బిల్లుల మంజూరు కోసం అక్టోబర్ వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ బోర్డు సభ్యులు రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఫణికుమార్, ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

ఓట్లను అపహరించిన బీజేపీ, బీఆర్ఎస్

ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య

కాజీపేట రూరల్: బీజేపీ, బీఆర్ఎస్ గతంలో ఓట్లను అపహరించాయని, శాసనసభ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల వ్యత్యాసం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఓటు చోరీపై కాజీపేటలో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈసీతో కలిసి ఓట్లను చోరీ చేస్తోందని, దీనిపై రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు. ఓటు చోరీపై ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించాలని వారు సూచించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీరజాలీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, నేషనల్ కోఆర్డినేటర్ పులి అనిల్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కాంగ్రెస్ నాయకులు అరారి సాంబయ్య, ఎండీ అంకూస్, గుంటి కుమార్, సుంచు అశోక్, సిరిల్‌లారెన్స్, దొంగల కుమార్, అజ్గర్, మనోహర్, నీలక్క, స్వరూప, సుకన్య, మానస, సమతా, రేవతి, శ్వేత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రకాళి అమ్మవారికి కేసీఆర్ బంగారు కిరీటం చేయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం భద్రకాళి చెరువు మట్టిని అమ్ముకుని అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, నాయకులు మర్రి యాదవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, రమేష్, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్‌కు పోలీసుల నోటీసులు..

దాస్యం వినయ్‌భాస్కర్‌కు పోలీసులు నోటీసులు అందించారు. రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ చౌరస్తాలో గత నెలలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వినయ్‌భాస్కర్ ధర్నా చేశారు. కాగా, ధర్నా చేసిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండ ఎస్సై సదానందం నోటీసులు అందించారు.

'స్థానికం'లో కాషాయ జెండా ఎగరేస్తాం

బీజేపీ వరంగల్ జిల్లా ఎన్నికల కన్వీనర్ అరూరి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

వరంగల్ చౌరస్తా: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ వరంగల్ జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశానుసారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారానాయక్, నాయకులు కొండేటి శ్రీధర్, డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కంభంపాటి పుల్లారావు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీశ్, గురుమూర్తి శివకుమార్, రత్నం సతీశ్‌షా, వన్నాల వెంకటరమణ, జిల్లా నాయకులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, జక్కు రమేశ్, వనంరెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, సునీత తదితరులు పాల్గొన్నారు.

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు మంగళవారం యూరియా వచ్చింది. ఆర్సీఎఫ్ యూరియా 1,319.220 మెట్రిక్ టన్నులు, క్రిప్కో యూరియా 1,321.20 మెట్రిక్ టన్నులు చేరుకుంది. ఆయా కంపెనీల రికార్డు ప్రకారం ఏఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో మార్క్‌ఫెడ్‌కు 60శాతం, ప్రైవేట్ ఫర్టిలైజర్ డీలర్లకు 40శాతం కేటాయించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

తల్లిని చంపిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు


నేరస్తుడు రాజుకుమార్

మొగుళ్లపల్లి: తల్లిని చంపిన కేసులో కుమారుడికి జిల్లా సెషన్స్ జడ్జి సీ.హెచ్. రమేశ్ బాబు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వంద జరిమానా విధించినట్లు ఎస్సై బొరగాల అశోక్ మంగళవారం తెలిపారు. మండలంలోని కొర్కిశాల గ్రామానికి చెందిన అప్పం సమ్మక్క, రాజుకుమార్ తల్లీకుమారులు. తోబుట్టువులను మంచిగా చూసుకుంటూ తనను పట్టించు కోవడం లేదని, తల్లిని చంపితే ఆస్తి మొత్తం తనకే వస్తుందనే ఉద్దేశంతో రాజుకుమార్ 2024 జూలై 26న రోకలిబండతో తల్లిని కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి చిన్న కుమారుడు అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేసి రాజుకుమార్‌ను కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యధారాలు పరిశీలించిన మేజిస్ట్రేట్.. నేరస్తుడు రాజుకుమార్‌కు జీవితఖైదు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలి

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు గీతారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గీతారెడ్డి

ఖిలా వరంగల్: చీడపీడల నివారణపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు గీతారెడ్డి అన్నారు. మంగళవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయో సైన్స్ ఇంటర్నేషనల్ (సీఏబీఐ) సహకారంతో కోఆర్డినేటర్ అరుణ జ్యోతి అధ్యక్షతన ఆధునిక డిజిటల్ వ్యవసాయ విధానం, చీడీపీడల యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమయానుసారంగా సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరచేయ డం అత్యంత కీలకమన్నారు. ఏఓలు, ఏఈఓలు డిజిటల్ యాప్‌ల వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకుని రైతులకు పురుగుల మందుల వినియోగంపై మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మధు మంజరి, డాక్టర్ అనీఫా, నర్సింగం, పాల్గొన్నారు.

బోధనలో నూతన పద్ధతులు పాటించాలి

- హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి

విద్యారణ్యపురి: విద్యాబోధనలో నూతన పద్ధతులు అవలంబించాలని హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస్‌స్వామి కోరారు. మడికొండ పీఎంశ్రీ హైస్కూల్‌లో ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), 3డీ ఉపకరణాల వినియోగంపై మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన కోర్సు డైరెక్టర్‌గా పాల్గొని మాట్లాడారు. బోధనలో ప్రయోగాలతోపాటు డిజిటల్ ఉపకరణాలు, ఏఆర్, 3డీ పరికరాలను ఉపాధ్యాయులు వినియోగించాలని సూచించారు. పీఎంశ్రీ ఒంటిమామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, మ్యాథ్స్, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ శిక్షణలో జిల్లా కా కోఆర్డినేటర్ డాక్టర్ బండారు మన్‌మోహన్, పీజీ హెచ్‌ఎం బి.సంధ్యారాణి మాట్లాడారు. హైదరాబాద్‌లోని సెల్కాన్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్ అన్వేశ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.


తెగులు.. దిగులు





తాటాకు తెగులు సోకిన పసుపు పంట, పుచ్చుపట్టిన దుంప, దుంప తొలుచు ఈగ సోకిన పసుపు దుంప, ఆకుమచ్చ తెగులు సోకిన పసుపు పంట

- పసుపు పంటకు మూడు నెలలు కీలకం..
- ఆకుమచ్చ, దుంపకుళ్లుతో పంటకు తీవ్ర నష్టం
- జాగ్రత్తగా ఉండాలి
- రైతులకు వరంగల్‌జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు సలహాలు



దుగ్గొండి: పసుపు.. పచ్చ బంగారం. రైతులకు సిరులు కురిపించే పంట. అయితే కొన్ని సంవత్సరాలుగా గిట్టుబాటు కావడం లేదు. మద్దతు ధర లేకపోవడం, దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు. గతేడాది వరంగల్ జిల్లా వ్యాప్తంగా 9 వేల ఎకరాలలో పసుపు పంట సాగుకాగా ఈ సారి 6 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ క్రమంలో విస్తీర్ణం తగ్గిన కారణంగా పసుపుకు అధిక ధర దక్కే అవకాశం ఉందని, రైతులు పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు సూచించారు. అధిక వర్షాల కారణంగా పసుపులో తాటాకు తెగులు, ఆకుమచ్చ, దుంప పుచ్చు, దుంప ఈగ తెగుళ్లు ఆశించాయని, వెంటనే అన్నదాతలు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పసుపు పంటకు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

దుంప తొలుచు ఈగ..

- ఈగ పిల్ల పురుగులు తెల్లరంగులో బియ్యం గింజల మాదిరి ఉండి భూమి లోపల ఉన్న దుంపల్లోకి చొచ్చుకుని వెళ్లి దుంపను తిని నాశనం చేస్తాయి. ఈ పురుగు వల్ల సుడి ఆకు దాని దగ్గరలో ఉండే లేత ఆకులు వాడి గోధుమ రంగుగామారి ఎండి రాలుతాయి. మువ్వను పీకితే సులభంగా ఊడి వస్తుంది.

నివారణ..

- ఈ పురుగు లక్షణాలు కనిపిస్తే ఎకరాకు 100 కిలోల వేపపిండిని మొక్కల మొదళ్ల వద్ద వేయాలి. వేప పిండి వేయడానికి వీలుకాకపోతే 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను 10 కిలోల ఇసుకలో కలిపి ఎకరం భూమిలో సమంగా చల్లాలి.

తాటాకు తెగులు..

- ఆకులపై అండాకారపు పెద్ద మచ్చలు ఏర్పడుతాయి. మచ్చలు గోధుమ రంగులో ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. తెగులు ఉధృతి ఎక్కువయినప్పుడు ఆకుల పండు బారి ఎండి రాలుతాయి.

నివారణ..

- తెగులు సోకిన ఆకులను తుంచి దూరంగా తీసుకెళ్లి కాల్చాలి.
- లీటర్ నీటికి మిల్లీలీటర్ ప్రొఫికొనజోల్, గ్రాము కార్బండిజమ్ మందులకు 0.5 మిల్లీలీటర్ల సబ్బు నీరును కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు..

- ఆకులపై చిన్న మచ్చలు ఏర్పడుతాయి. పసుపు రంగు మచ్చలు కాస్తా గోధుమరంగులోకి మారి ఆకులు వడలి రాలుతాయి.

నివారణ..

- కార్బండిజమ్ లీటర్ నీటికి గ్రాము, ప్రొఫికొనజోల్ లీటర్ నీటికి మిల్లీలీటర్ కలిపి ఆకుల తడిచేలా పిచికారీ చేయాలి.

దుంప కుళ్లు..

- పసుపు చేనులో ముదురు ఆకులు వాడి గోధుమరంగుకు మారి ఎండి రాలుతాయి. తెగులు ఎక్కువతే ముదురు ఆకుల నుంచి లేత ఆకులకు వ్యాప్తి చెందుతుంది. కాండం గోధుమ రంగుకు మారుతుంది. తల్లికొమ్ములు, పిల్ల దుంపలు కుళ్లి మెత్తబడుతాయి. తెగులు సోకిన దుంపలను పరిశీలిస్తే లోపల పసుపు రంగుకు బదులు మట్టిరంగు కనిపిస్తుంది.

నివారణ..

- దీనికి విత్తనశుద్ధి కీలకం. లీటర్ నీటికి 3 గ్రాముల రెడోమిల్, 2 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మందు కలిపిన నీళ్లలో 30 నిమిషాలు నానబెట్టి ఆ తర్వాత ఆరబెట్టి మళ్లీ లీటర్ నీటికి 5 గ్రాముల ట్రికోడెర్మా విరిడి కలిపిన మందులో అరగంట సేపు నానబెట్టి ఆరబెట్టి విత్తాలి. తెగులు సోకిన మొక్కల వద్ద లీటర్ నీటికి 3 గ్రామాలు రెడోమిల్ గాని, కాపర్ ఆక్సీక్లోరైడ్ గాని కలిపి మొక్క మొదలు వద్ద భూమి తడిచేలా పోయాలి.

జేఎన్‌ఎస్‌లో కబడ్డీ ఎంపికలు


ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలుర నుంచి 12 మంది, బాలికల నుంచి 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.డి. అజీజ్ ఖాన్, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, డీఐఈఓ ఎ. గోపాల్, ప్రభుత్వ వ్యాయామ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దరిగె కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, కోట సతీష్, రఘువీర్, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ముగ్గురు అధ్యాపకులు


సదాశివ్ చిర్రరాజు రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్: తమిళనాడులోని మదురై కామరాజు యూనివర్సిటీలో ఈనెల 9,10,11తేదీల్లో 'విశ్వర్షి వాసలి వాఙ్మయం దృక్పథాల ఆవిష్కరణ' అనే అంశంపై జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ముగ్గురు కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొననున్నారు. కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ చిర్రరాజు, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ తెలుగు విభాగం పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ పాల్గొని ఆయా అంశాల్లో పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు.

చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి


అవగాహన కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్, పరిపాలన అధికారులు

కేయూ క్యాంపస్ : రాజ్యాంగం ప్రకారం సమాచారం పొందడం ప్రతీ భారతీయ పౌరుడి ప్రాథమిక హక్కు అని, సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులు అడిగిన సమాచారం 30 రోజులలోపు ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం నుంచి మంగళవారం ఆన్‌లైన్‌లో అన్ని యూనివర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, పరిపాలన అధికారులు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సమాచారం హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. కేయూ నుంచి వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, 'లా' కళాశాల డీన్ ఎం. శ్రీనివాస్, వివిధ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ పౌరులు అడిగిన సమాచారం 30 రోజులలోపు ఇవ్వకపోతే సంబంధిత అధికారులు రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషన్‌కు బాధ్యులవుతారన్నారు. 2005నుంచి సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, దీనిని కచ్చితంగా అమలుచేయాల్సిందే అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


కేఎంసీ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, ఆస్పత్రి సిబ్బంది

ఎంజీఎం: కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ఎదుట సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యకు వినతిపత్రాలు అందించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జె.సుధాకర్, ఆస్పత్రి సిబ్బంది శోభ, సంధ్య, భానురేఖ, విక్రం, కోమల, సంతోష్‌కుమార్, లావణ్య, మౌనిక, స్రవంతి, హిమబిందు, శ్రావణి పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్‌కు పురస్కారం


ఇనగాల వెంకట్రాంరెడ్డికి పురస్కారం అందిస్తున్న శాంతికృష్ణ

నయీంనగర్: 'కుడా' చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని శ్రీ శాంతికృష్ణ సేవా సమితి అధ్యక్షుడు శాంతికృష్ణ మంగళవారం కాకతీయ కీర్తి సేవా పురస్కారంతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కాకతీయ కళా వైభవం–శ్రీశాంతికృష్ణ సేవా సమితి 40వ వార్షికోత్సవం, 1,112వ అంతర్జాతీయ కళా మహోత్సవాల సందర్భంగా శ్రీ శాంతికృష్ణ సేవా సమితి ఇనగాల వెంకట్రాంరెడ్డిని కాకతీయ కీర్తి సేవా పురస్కారానికి ఎంపిక చేసింది.

కుడా చైర్మన్‌కు విజ్ఞప్తి

సమస్యలు పరిష్కరించాలని ఇన్నర్‌రింగ్ రోడ్డు బాధితులు మంగళవారం కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే వారి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

'బీఏఎస్' బకాయిలు విడుదల చేయాలి


వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

న్యూశాయంపేట: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్)కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు తమ పిల్లలను పాఠశాలల్లోకి అనుమతించేడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ విశ్వప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కందిక చెన్న కేశవులు, కళ్యాణి, రాకేష్, వెంకన్న, రాజు, భద్రు, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసు తారు మారు

- హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు
- ఎస్సైతోపాటు వైద్యులపై కేసు నమోదుకు ఆదేశం

హసన్‌పర్తి: ప్రత్యర్థులు దాడి చేస్తే గాయపడిన తనను రోడ్డు ప్రమాదానికి గురైనట్లు కేసు తారుమారు చేశారని బాధితుడు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో సదరు అధికారులపై కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు ఎస్సై సాంబయ్యతోపాటు వైద్యులపై కేసు నమోదైనట్లు హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎస్సై సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్ అనే యువకుడిపై 2022లో కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. సంఘటనస్థలాన్ని పరిశీలించిన అప్పటి ఎస్సై సాంబయ్యతోపాటు వైద్యులు కూడా తాను రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు నివేదిక ఇచ్చారంటూ ప్రశాంత్‌కుమార్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కేసును తారుమారు చేసిన ఎస్సై సాంబయ్యతోపాటు వైద్యసిబ్బందిపై కేసు నమోదు చేయాలని హైకోర్టు.. హనుమకొండ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఎస్సైతోపాటు వైద్యులపై కేసు నమోదైంది.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య


వేయిస్తంభాల దేవాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, అధికారులు

హన్మకొండ కల్చరల్/ హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని తన కార్యాలయంలో పురావస్తుశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. వేయిస్తంభాల దేవాలయంలోని కల్యాణమండపం మరమ్మతులు, విగ్రహప్రతిష్ఠాపన, భద్రకాళి దేవాలయం, చిల్పూరులోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి, భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డిగుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే, వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం పురావస్తుశాఖ అధికారులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వేయిస్తంభాల దేవాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్కియాలజిస్ట్ సూపరింటెండెంట్ నిహిల్ దాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణి పాండే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మ్యూజియం పనులు పూర్తిచేస్తాం

- రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు


మ్యూజియాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు

ఖిలా వరంగల్: మ్యూజియం అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు తెలిపారు. మంగళవారం ఖిలా వరంగల్‌కోటను రాష్ట్ర పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, అడిషనల్ డైరెక్టర్ బుజ్జి, పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిల్పాల ప్రాంగణంలోని శిల్పసంపదను తిలకించారు. అనంతరం నిర్మాణంలోని మ్యూజియం భవనాన్ని సందర్శించి మాట్లాడారు. దీర్ఘకాలిక కొనసాగుతున్న మ్యూజియం అభివృద్ధి పనులు పూర్తిచేసి పర్యాటకులు, జిల్లా వాసులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. భక్తులు, పర్యాటకులకు చరిత్ర తెలిసేలా సైన్ బోర్డులు, వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆదేవిధంగా ఆలయ గోడలపై ఉన్న వైట్‌వాష్‌ను రసాయనాలతో శుద్ధి (కెమికల్ క్లీనింగ్) చేయాలని సూచించారు. అంతకుముందు స్వయంభూ దేవాలయంలోని శంభులింగేశ్వరుడిని దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శంభులింగం పూర్ణ కుంభంతో ఆయనను స్వాగతించారు. కార్యక్రమంలో కోట గైడ్ రవియాదవ్, సౌండ్ అండ్ లైటింగ్ షో ఇన్‌చార్జ్ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి

న్యూశాయంపేట: స్థానిక సంస్థల ఎన్నికలు, కౌంటింగ్‌కు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. ఏనుమాముల మార్కెట్ యార్డులో జిల్లాలోని 11 మండలాలకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలాల వారీగా బ్యాలెట్ బాక్సులు భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల పక్కపక్కనే ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సదుపాయాల కల్పనలో ఎలాంటి సమస్య రాకుండా ఉండాలని పేర్కొన్నారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి ఉన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన..

వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులో జిల్లా గోదాములను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. భద్రత చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డీపీఓ కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, హౌసింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు పాటించాలి..

ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యం కచ్చితంగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ప్రింటింగ్, ముద్రణ యాజమాన్యంతో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన పాల్గొన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం –2018 ప్రకారం ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ముద్రణ, ప్రచురణలపై దిశా నిర్దేశం చేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

- జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టాంజిన్ డైకిడ్


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ టాంజిన్ డైకిడ్

ఎంజీఎం: కౌమార దశ నుంచే విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టాంజిన్ డైకిడ్ సూచించారు. జాతీయ స్ట్రాటజిక్ ఇన్ఫర్మేషన్ కన్సల్టెంట్ రాజీవ్‌తివారీతో కలిసి హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా కడిపికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపకూడదని పేర్కొన్నారు. అనంతరం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హెచ్‌ఐవీ టెస్టులు, గర్భిణులకు పరీక్షలు, కౌన్సెలింగ్‌ను పరిశీలించారు. హనుమకొండ టీబీ ఆస్పత్రిలోని సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్, ఐసీటీసీ, హెచ్‌ఐవీ వైరల్ లోడ్ టెస్టింగ్ ల్యాబోరేటరీ, కౌన్సెలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టాంజిన్ డైకిడ్, బృందం సభ్యులు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌ఓలు అల్లెం అప్పయ్య, సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్మోహన్‌రావు, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాయింట్ డైరెక్టర్లు రవికుమార్, శిల్ప, టి.అనురాధ, కె.ప్రసాద్, రమేష్, మధుసూదన్, డీడీ ల్యాబ్ సర్వీసెస్ హరిత, ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు సీహెచ్ సూర్యప్రకాశ్, రామనోహర్ రావు, ప్రోగ్రాం అధికారి మోహన్‌సింగ్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ స్వప్న మాధురి, జిల్లా మాస్‌మీడియా అధికారి అశోక్‌రెడ్డి, రామకృష్ణ, కమలాకర్, ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్ర అధ్యక్షులు లైలా, ఇక్బాల్ పాషా పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు అడ్డుకునే యత్నాన్ని విరమించుకోవాలి


దిష్టిబొమ్మను లాక్కుంటున్న పోలీసులు

హన్మకొండ: బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ప్రయత్నాన్ని విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని కాళోజీ కూడలిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బైరి రవి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని రిజర్వేషన్ వ్యతిరేకులైన రెడ్డి జాగృతి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదని, ఇటీవల బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని సుప్రీంకోర్టులో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీసీ రిజర్వేషన్లు అన్యాయంగా అడ్డుకోవాలని రెడ్డి జాగృతి చూస్తుంటే ప్రధాన పార్టీల అగ్ర నాయకులు ఎవరు స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, మాదం పద్మజ దేవి, మాడిశెట్టి అరుంధతి, తడక సుమన్ గౌడ్, దొడ్డపల్లి రఘుపతి, కాసగాని అశోక్, దాడి రమేశ్ యాదవ్, ఏరుకొండ పవన్ కుమార్, పులి మోహన్ గౌడ్, తంగళ్లపల్లి రమేశ్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, పంజాల మధు తదితరులు పాల్గొన్నారు.

14 వరకు ఎన్‌ఎంఎంఎస్ పొడిగింపు

కాళోజీ సెంటర్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తుల గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు వరంగల్ డీఈఓ రంగయ్య నాయుడు తెలిపారు. జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలు చొరవ తీసుకుని తమ విద్యార్థులతో ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేయించాలన్నారు. ఈ పరీక్షపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.